క్లుప్తంగా

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: జేఆర్‌పేటలో నివాసం ఉంటున్న అనంతసాగరం మండలానికి చెందిన చల్లా వెంకట కృష్ణారెడ్డి, విజయలలిత కుమారుడికి వివాహం నేపథ్యంలో వధూవరులు వెంకటగౌతమ్, భావనలను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆశీర్వదించారు. జేఆర్‌పేటలోని వారి ఇంటికి వెళ్లి అభినందన తెలిపి ఆశీర్వదించారు. ఆయన వెంట ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్రనాయుడు, కౌన్సిలర్ తుమ్మల త్రివేణి, గంగాధర్ పాల్గొన్నారు.

వంట పాత్రల పరిశీలన



ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం సరఫరా చేసిన వంట పాత్రలను శనివారం ఎంఈఓ మస్తాన్‌వలి, గండిపాళెం, గడ్డంవారి పల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు వెంకటేశ్వర్లు, మాలకొండయ్య పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని 59 పాఠశాలలకు ఈ పాత్రలు వచ్చాయన్నారు. పాత్రలను సోమవారం నుంచి పాఠశాలలకు సరఫరా చేస్తామన్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి, పాఠశాలలను ఏ, బీ, సీ, డీ,ఎఫ్ కేటగిరీలుగా విభజించామన్నారు.

గంధమహోత్సవం



గుర్రంపై ఊరేగింపుగా గంధాన్ని దర్గా వద్దకు తీసుకెళ్తున్న భక్తులు

మర్రిపాడు: మండలంలోని ఖాన్‌సాహెబ్‌పేట హజరత్ షేక్ అబ్దుల్ ఖాదిర్ జిలానీ గౌస్ ఉల్ అజమ్ సయ్యదున 25వ గంధమహోత్సవాన్ని శనివారం తెల్లవారు జామున ఘనంగా నిర్వహించారు. దర్గా పీఠాధిపతి బందా నవాజ్ బాబా (గోపిదేసి హజరత్తయ్య) నివాసం నుంచి గంధాన్ని ఊరేగింపుగా దర్గా ప్రాంగణం వరకు పీఠాధిపతి గుర్రంపై ఉరేగింపు గంధం తీసుకుని గంధమహోత్సవం నిర్వహించారు.

హ్యూమన్ కంప్యూటర్ శకుంతలాదేవి



శకుంతలాదేవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సోమశిల: ప్రముఖ గణిత మేధావి శకుంతలాదేవి జయంతిని మండలంలోని చిలకలమర్రి జెడ్పీ హైస్కూల్‌లో శనివారం గణిత ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం సురేష్ ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గణితంలో అసాధారణ ప్రజ్ఞ కలిగిన శకుంతలాదేవి హ్యూమన్ కంప్యూటర్‌గా కీర్తింపబడ్డారన్నారు. విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, రమణ, మహేష్, వెంకటేశ్వర్లు, మాధవి, శివకృష్ణ పాల్గొన్నారు.

చేజర్లలో మోస్తరు వర్షం

చేజర్ల: ఈశాన్య రుతుపవనాలు, బంగాళాఖాంతలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో శనివారం చేజర్లలో చిరుజల్లులతో ప్రారంభమై ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం కాస్త ఊరటనిచ్చింది.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న శంకర నేత్రాలయ ఉచిత కంటి చికిత్సా శిబిరంలో ఆదివారం ఉదయం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొంటారని ఆయన కార్యాలయ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

బట్రెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ




బట్రెడ్డి తిరుపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి

సోమశిల: అనంతసాగరం వైఎస్సార్‌సీపీ నేత బట్రెడ్డి జనార్దన్‌రెడ్డిని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శనివారం పరామర్శించారు. జనార్దన్ రెడ్డి తండ్రి తిరుపాల్‌రెడ్డి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మేకపాటి పరామర్శించారు. శనివారం ఆయన నివాసానికి వెళ్లి తిరుపాల్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.

ఆమె రాజ్యాధికార నిర్ణేత

అన్ని రంగాల్లో అగ్రగామిగా దూసుకుపోతున్న అతివలు ఆత్మకూరు నియోజకవర్గంలో రానున్న 2024 ఎన్నికల్లో రాజ్యాధికార నిర్ణేతలుగా మారనున్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ గత నెల 26న విడుదల ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం ఆత్మకూరు నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అత్యధికంగా ఉన్నారు.



- నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికం
- మొత్తం 2,16,363 ఓట్లు
- అందులో మహిళా ఓటర్ల 1,09,030 మంది

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య గత సంవత్సరం నిర్వహించిన ఉప ఎన్నికల సమయంలో ఉన్న ఓట్ల కంటే ప్రస్తుతం స్వల్పంగా ఓటర్లు పెరిగింది. నియోజకవర్గంలో మొత్తం 2,16,363 మంది ఓటర్లు ఉండగా అందులో మహిళా ఓటర్ల 1,09,030 మంది, పురుష ఓటర్లు 1,07,322 మంది, థర్డ్ జెండర్ 11 మందిగా ఉన్నారు. ఉప ఎన్నికల సమయంలో ఆత్మకూరు నియోజకవర్గంలో మొత్తం 2,13,644 మంది ఓటర్లు ఉండగా తాజాగా 2,719 మంది ఓటర్లు పెరగడం విశేషం. బూత్ స్థాయిలో అధికారులు చేపట్టిన ఓటర్ల జాబితా నవీకరణ అనంతరం మండలాల వారీగా ఒక్కసారి గమనిస్తే మర్రిపాడు మండలంలో ఉప ఎన్నికల సమయంలో 35,195 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం 34,980 ఓటర్లు ఉన్నారు. దాదాపుగా 215 ఓట్లను తొలగించారు. అనంతసాగరం మండలంలో ఉప ఎన్నికల సమయంలో 35,002 ఓట్లు ఉండగా ప్రస్తుతం 35,691 ఓట్లు ఉనాయి. ఆత్మకూరు మండలంలో గతంలో 26,199 ఓట్లు ఉండగా ప్రస్తుతం 26,675 ఓట్లు ఉన్నాయి. ఆత్మకూరు పట్టణంలో గతంలో 25,926 ఓట్లు ఉండగా ప్రస్తుతం 26,637 ఓట్లు ఉన్నాయి. ఏఎస్‌పేట మండలంలో గతంలో 28,026 ఓట్లు ఉండగా ప్రస్తుతం 28,269 ఓట్లు ఉన్నాయి. సంగం మండలంలో గతంలో 35,402 ఓట్లు ఉండగా ప్రస్తుతం 36,537 ఓట్లు ఉన్నాయి. చేజర్ల మండలంలో 27,894 ఓట్లు ఉండగా ప్రస్తుతం 27,574 ఓట్లు ఉన్నాయి. ఇక్కడ 320 ఓట్లను తగ్గాయి. నియోజకవర్గంలో అనంతసాగరం మండలంలో 689, ఆత్మకూరు రూరల్ 476, ఆత్మకూరు పట్టణంలో 711, ఏఎస్‌పేట 243, సంగం 1135 ఓట్లు లెక్కన 3254 ఓట్లు పెరుగుదల ఉండగా, మర్రిపాడు, చేజర్లలో 535 ఓట్ల తొలగింపులతో నియోజకవర్గంలో 2,719 ఓట్లు పెరిగింది. కాగా నూతన ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు డిసెంబర్ 9వ తేదీ వరకు అధికారులు అవకాశం కల్పించారు. శని, ఆదివారాల్లోనూ, డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలను ఏర్పాటు చేసి ఉదయం నుంచి సాయంత్రం వరకు బీఎల్‌ఓలు పోలింగ్ కేంద్రాల్లో ఉండి నూతన ఓటర్ల నమోదు ప్రక్రియతో పాటు మార్పులు, తొలగింపులు, సవరణలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

డిసెంబర్ 9 వరకు నమోదుకు అవకాశం



ప్రస్తుతం ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, మరణాలు, శాశ్వత వలసలు తదితర కారణాలతో ఓటర్ల జాబితాలో అవసరమైన నమోదులకు అవకాశం ఉంది. సంబంధిత సిబ్బంది క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి ఓటర్ల జాబితా పక్కాగా తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

– కురుబ మధులత, డివిజనల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ ఆత్మకూరు

స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపొందించాలి



క్యాంప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ కురుబా మధులత



ఓటు నమోదు పత్రాలు పరిశీలిస్తున్న తహసీల్దార్



క్యాంపును పరిశీలిస్తున్న తహసీల్దారు నాగరాజు

- ఆర్డీఓ కురుబా మధులత

ఆత్మకూరురూరల్: ప్రతి పోలింగ్ బూత్‌లోనూ స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపొందించేలా బీఎల్‌ఓలు ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని ఆత్మకూరు ఆర్డీఓ కురుబా మధులత చెప్పారు. మండలంలోని రామస్వామిపల్లి, మహిమలూరు, రావులకొల్లు, చెర్లోయడవల్లి బీఎల్ఓ కేంద్రాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఓటర్ల జాబితాలో 0 అడ్రస్సులు, డబుల్ ఎంట్రీలు, శాశ్వత వలసలు, తదితరాలను గుర్తించి తొలగించాలని, దీంతో పాటు గ్రామంలో నివాసం ఉండి 18 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరికీ ఓటు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దారు జగదీష్‌బాబు, ఆర్‌ఐ పృథ్వీకుమార్, వీఆర్‌ఓలు సూరిపోగు కృష్ణయ్య, రమణయ్య, కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శులు కార్తీక్, భాస్కర్, సంపూర్ణ పాల్గొన్నారు.

చేజర్ల: మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌లో ఓటర్ల నమోదుపై ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కృష్ణ కోరారు. శనివారం మండలంలోని చిత్తలూరు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కొత్తగా ఓటు నమోదుకు ఆదివారం కూడా ప్రత్యేక క్యాంప్ కొనసాగుతుందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. నమోదుకు అవసరమైన పత్రాలు తీసుకెళ్లాన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంగం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో బీఎల్‌ఓలు నిర్వహించిన ఎన్నికల ప్రత్యేక క్యాంపును శనివారం తహసీల్దారు నాగరాజు తనిఖీ చేశారు. ఓటు నమోదు ప్రక్రియపై బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ క్యాంప్‌లో ఫారం-6లు 53, ఫారం-8లు 93 వచ్చాయని, వెంటనే వాటిని పరిశీలించి పూర్తి చేస్తామని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో జరిగే ఎన్నికల స్పెషల్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రౌడీల్లా ప్రవర్తిస్తే కేసులు పెట్టరా



మాట్లాడుతున్న మాలకొండారెడ్డి



కలిగిరి: మాట్లాడుతున్న జెడ్పీటీసీ మాల్యాద్రిరెడ్డి, మండల కన్వీనర్ రవీంద్రారెడ్డి

- జలదంకి ఎస్సైపై టీడీపీ నేతల దురుసు తనం
- వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మాలకొండారెడ్డి

జలదంకి: ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, టీడీపీ నాయకులు జలదంకి బస్టాండ్ సెంటర్లో రౌడీల్లా ప్రవర్తించడంతో పాటు ఎస్సై ఆదిలక్ష్మితో దురుసుగా ప్రవర్తించారని, ఈ కారణంతోనే టీడీపీ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారని వైఎస్సార్‌సీపీ జలదంకి మండల కన్వీనర్ పాలవల్లి మాలకొండారెడ్డి చెప్పారు. శనివారం జలదంకిలో మండలంలోని నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ మంజూరు కావడంతో రాష్ట్రంలో ప్రతి చోట సంబరాలు చేసుకున్నారన్నారు. అయితే జలదంకి మండలంలో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావుతో పాటు 20 మంది రోడ్డుపైకి వచ్చి సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారన్నారు. బొల్లినేని రామారావు ఎస్సై పట్ల ఓవరాక్షన్ చేస్తున్నావంటూ దురుచుగా మాట్లాడారన్నారు. ఈ ఘటనపై జలదంకి ఎస్సై ఆదిలక్ష్మి తన ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు వారి సూచనల మేరకు టీడీపీ నేతలపై కేసు నమోదు చేశారన్నారు. అయితే బొల్లినేని, జిల్లా టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ ప్రోద్బలంతో ప్రభుత్వం తమపై కేసులు పెట్టిందని ఆరోపించడం సిగ్గు చేటన్నారు. చంద్రబాబు బయటకు వచ్చే సందర్భంలో ప్రతి చోటా సంబరాలు చేసుకున్నారని, అయితే జలదంకి మండలంలోనే ఎందుకు టీడీపీ నాయకులపై కేసు నమోదైందని ప్రశ్నించారు. జలదంకిలో టీడీపీ నేతలు విచ్చలవిడిగా రెచ్చిపోయారన్నారు. బీసీ మహిళ అయిన ఎస్సైను దురుసుగా మాట్లాడడంతోనే కేసు నమోదైందన్నారు. టీడీపీ, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేసులు పెట్టించినట్లు ప్రచారం చేసుకుంటూ పబ్బం గడుపుకుంటుందన్నారు. టీడీపీ భూ స్థాపితం కావడం ఖాయమని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, నాయకులు రావి ప్రసాద్‌నాయుడు ఇ మదన్‌మోహన్‌రెడ్డి, ఎస్.వెంకటశేషారెడ్డి, కోర్సిపాటి రామిరెడ్డి, బండి కృష్ణారెడ్డి, గుర్రం జగ్గయ్య, వెంగారెడ్డి, సుబ్బారెడ్డి ఇందిరమ్మ, దామెర్ల దేవదాసు పాల్గొన్నారు.

అధికారులపై దురుసు ప్రవర్తన తగదు

కలిగిరి: విధి నిర్వహణలో ఉన్న అధికారులపై టీడీపీ నాయకులు దురుసుగా వ్యవహరించడం తగదని జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి అన్నారు. కలిగిరిలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ స్కిల్ స్కాంలో బెయిల్‌పై చంద్రబాబు వచ్చిన సందర్భంగా జలదంకిలో టీడీపీ నేతలు ప్రజలకు ఇబ్బందులు కలిగేలా సంబరాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రజలకు, రాకపోకలకు ఆటంకం కలుగకుండా సంబరాలు జరుపుకోవాలని జలదంకి ఎస్సై ఆదిలక్ష్మి సూచించారన్నారు. బొల్లినేని వెంకటరామారావుతో పాటు నాయకులు ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, దురుసుగా వ్యవహరించారన్నారు. మహిళా అధికారిణితో దురుసుగా వ్యవహరించిన టీడీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ కోడూరు కృష్ణారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సుద్దలమోహన్, స్థానిక నాయకులు రాధాకృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మనోహర్, శ్రీను, రవి, వేమనారాయణ, ఖాజామొయినుద్దీన్, తిరుపాలు పాల్గొన్నారు.

ఆర్డీఓను కలిసిన రెవెన్యూ అసోసియేషన్



ఆర్డీఓను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఆత్మకూరు: నూతన ఆర్డీఓ కె మధులతను ఆత్మకూరు తాలుకా రెవెన్యూ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు శనివారం కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి అభినందించారు. ఆర్డీఓ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులను రెవెన్యూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మర్రిపాడు తహసీల్దారు ఆనంద్, డీటీలు శేషయ్య, సంధ్య, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ ప్రదీప్, హర్ష పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి భూమి పూజ



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి

సోమశిల: టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులతో ఇనగలూరులోని మల్లెం కొండేశ్వరస్వామి అంకమ్మ తల్లి గుడి నిర్మాణానికి ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గంలో 58 దేవాలయాలకు రూ.5.80 కోట్ల నిధులు మంజూరు చేయించారని, నియోజకవర్గంలో తొలి దేవాలయ నిర్మాణానికి ఇనగలూరులో శ్రీకారం చుట్టారని వివరించారు. మిగిలిన దేవాలయాల నిర్మాణాలను కూడా త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

పీహెచ్‌డీ ప్రదానం



ఆటా మధు

అల్లూరు: మండలంలోని గోగులపల్లికి చెందిన ఆట మధుకు విక్రమ సింహపురి యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. విక్రమ సింహపురి కావలి క్యాంపస్ వాణిజ్య విభాగానికి చెందిన పరిశోధకుడు ఆట మధు నెల్లూరు జిల్లాలోని సముద్ర తీరంలోని మత్స్యకారుల కోసం సంస్థాగత, సంస్థాగేతర ఆర్థిక సదుపాయాలనే అంశంపై పరిశోధన చేసి, గ్రంధాన్ని యూనివర్సిటీకి సమర్పించారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు



సచివాలయం భవనం ప్రారంభించి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: గ్రామ స్థాయిలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలు ప్రజల చెంతకు చేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని బోయలచిరివెళ్లలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల ద్వారా స్థానిక ప్రజలతో పాటు రైతులు, విద్యార్థులు, మహిళలు, యువకులు తమ అవసరమైన సేవలను, సులభంగా వేగంగా పొందే సౌలభ్యం ఏర్పడిందన్నారు. ఎరువులు, విత్తనాలు తదితర ప్రభుత్వ ప్రోత్సాహకాలు అన్నదాతలకు అందుబాటులోకి వచ్చాయన్నారు.

జనరంజకంగా జగనన్న పాలన



గడప గడపకు మన ప్రభుత్వం ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సోమశిల: క్షేత్ర స్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరించడమే కాకుండా అన్ని విధాలుగా ఆదుకుంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. శనివారం లింగంగుంట సచివాలయం పరిధిలో రెండో రోజు గార్లదిన్నెపాడు, ఇనగలూరు గ్రామాల్లో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు నిర్మాణ విషయమై గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకురావడంతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 7వ తేదీ కలెక్టర్‌తో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నామని, సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ వెంకట రమణారెడ్డి, ఉప సర్పంచ్ శైలజ, ఎంపీపీ పెయ్యాల సంపూర్ణమ్మ, జేసీఎస్ కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి, శాప్ డైరెక్టర్ కాలువ నరసింహులు, సర్పంచ్ బిజివేముల ఓబుల్‌రెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్.ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నారయ్య, తహసీల్దారు సుభాషిణి, ఎంపీడీఓ మధుసూదన్, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల అందజేత



ఆత్మకూరులో సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: ప్రజల ఆరోగ్యం, సంక్షేమమే ప్రధాన ఆశయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి అన్నారు. పలు అనారోగ్య కారణాలతో ఆరోగ్యశ్రీ వర్తించక వైద్యం చేయించుకున్న, వారికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సహాయం చేస్తున్నారన్నారు. ఆత్మకూరులోని ఆయన కార్యాలయంలో శనివారం పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను ఆయన అందజేశారు, ఆత్మకూరుకు చెందిన బత్తిన లక్ష్మీసుజాతకు రూ.60 వేలు, షేక్ ఆరీఫ్‌కు రూ.2.70 లక్షలు, మార్తం అరుణమ్మకు రూ.70 వేలు, షేక్ సత్రాబీకి రూ.65 వేలు చొప్పున సీఎం సహాయనిధి చెక్కులను ఆయన బాధితులకు, వారి బంధువులకు అందజేశారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని బోయలచిరివెళ్లలో ప్రభుత్వం అందజేసిన సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శనివారం అందజేశారు. మండలంలోని బట్టేపాడుకు చెందిన పులిమి సుధాకర్ రెడ్డికి రూ.60 వేలు, బొటికర్లపాడుకు చెందిన గాలి బుజ్జమ్మకు రూ.65 వేలు, కరటంపాడుకు చెందిన జిలానీబేగంకు రూ.55 వేలు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, బోయలచిరివెళ్ల, పమిడిపాడు సర్పంచ్‌లు బొలిగర్ల వెంకటేశ్వర్లు, సతీష్, ఎంపీటీసీ ఖాసీంసా, ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, జేసీఎస్ మండల కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు రావూరు శ్రీనివాసులు రెడ్డి, మంతు యానాదిరెడ్డి, సూరం జనార్దన్ రెడ్డి, షేక్ నాయబ్ రసూల్, వలంటీర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

సోమశిల: అనంతసాగరం మండలంలో ఇరువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అందజేశారు. అనంతసాగరం మండలం పడమటికంభంపాడుకు చెందిన ముక్కు వరలక్ష్మి భర్త అనారోగ్యంతో మృతి చెందారు. ఈ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.4 లక్షలు మంజూరు చేయించారు. మండలంలోని ఉప్పలపాడుకు చెందిన మాదిరెడ్డి విజయశాంతికి రూ.2 లక్షలు చెక్కును అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఎద్దల శ్రీనివాసులరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు ఉన్నారు.

సాంకేతికతతో ప్రతి విద్యార్థి రాణించాలి



విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టును వీక్షిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ఆధునిక విజ్ఞానం, సాంకేతికతను ఉపయోగించుకుని ప్రతి విద్యార్థి వృద్ధి చెందాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని గౌరవరంలో ఉన్న ఆర్‌ఎస్‌ఆర్ ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహించిన వైజ్ఞానిక దినోత్సవ వేడుకల్లో విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు 304 ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు సాంకేతికత, ఆధునిక విజ్ఞానంలో ముందుడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



ధ్వజ స్తంభం ప్రతిష్ఠలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

కావలి: మండలంలోని అన్నగారిపాళెం పంచాయతీ ముందర పాట్టెమ్మ దేవస్థానంలో శనివారం వైభవంగా ధ్వజ స్తంభ ప్రతిష్ట జరిగింది. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ముందర పాట్టెమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యలో పోలీసుల వైఫల్యం లేదు




మాట్లాడుతున్న డీఎస్పీ, సీఐ, ఎస్సైలు

- డీఎస్పీ కోటారెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరులో స్కూటర్ మెకానిక్‌ల మధ్య జరిగిన చిన్న వివాదంలో యువకుడు రౌతు వినయ్ ఆత్మహత్యకు పాల్పడడం బాధాకరమని, ఈ విషయంలో పోలీసుల వైఫల్యం ఏ మాత్రం లేదని ఆత్మకూరు డీఎస్పీ ఎస్.కోటారెడ్డి అన్నారు. రౌతు వినయ్ ఆత్మహత్య ఘటనపై పలు దినపత్రికలు, సోషల్ మీడియాలో పలు రకాల వదంతులు వస్తున్న నేపథ్యంలో శనివారం ఆయన సీఐ జి.వేణు, ఎస్సై ముత్యాలరావుతో కలిసి సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక ఆర్టీసీ డిపో సమీపంలో మెకానిక్ దుకాణం నిర్వహిస్తున్న వంశీ వద్ద రౌతు వినయ్ సహాయకుడిగా పనిచేస్తున్నాడని, వీరి షాపు ఎదుట ఉన్న మరో దుకాణదారుడు బైక్‌ను పార్కింగ్ చేస్తుంటాడని, ఆ బైక్ వైర్లు కత్తిరిస్తున్నాడని అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. దీంతో ఇరువర్గాలను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపామన్నారు. అయితే మరుసటి రోజు కొందరు వినయ్ పనిచేస్తున్న దుకాణం వద్దకు వచ్చి అతనిపై దాడికి పాల్పడ్డారని, వెంటనే వారి స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు వివరించారు. దాడికి గురైన వినయ్ అయ్యప్పస్వామి దీక్షలో ఉన్నాడన్నారు. అతనిపై దాడికి పాల్పడిన వారు ముస్లింలు కావడంతో కొందరు పనిగట్టుకొని హిందూ, ముస్లిం గొడవగా చిత్రీకరిస్తూ సోషల్ మీడియాలో వైరల్ చేయడం సరైన పద్ధతి కాదన్నారు. వినయ్ తన తల్లిదండ్రులు నివాసం ఉంటున్న బుచ్చిరెడ్డిపాళెంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. ఈ ఘటనతో ఆత్మకూరు పోలీసులకు సంబంధం లేదని డీఎస్పీ వివరించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుచ్చి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించనున్నట్లు, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెంలో జరిగిన రెండు ఘటనలపై పూర్తి స్థాయి విచారణ నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

ముమ్మరంగా కంటి శస్త్ర చికిత్సలు



శంకర నేత్రాలయ శస్త్ర చికిత్సా శిబిరంలో కంటి ఆపరేషన్లు చేయించుకున్న రోగులు

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో భారత రక్షణ శాఖ సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్ రెడ్డి దాతృత్వంతో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరంలో కంటి శస్త్ర చికిత్సలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. గత నెల 29న ప్రారంభమైన వైద్య శిబిరంలో ఇప్పటి వరకు 795 మంది రోగులను పరీక్షించగా వీరిలో 194 మందికి కంటి ఆపరేషన్లు చేసేందుకు నిర్ణయించారు. వీరిలో 112 మందికి ఇప్పటి వరకు కంటి ఆపరేషన్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.